నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 22, 2024 | www.navatelangana.com

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కలెక్టర్ రాజార్షిషాను ఆయన కార్యాలయంలో జిల్లా టీఎన్జీవోస్ కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగుల సమస్యలతో పాటు కారుణ్య నియామకాలు త్వరగా చేపట్టాలని కోరారు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ తెలిపారు.



లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను అభినందించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

అటల్ పెన్షన్ యోజన పథకం 2023-24 సంవత్సరంలో జూలై, సెప్టెంబర్ నెలల మధ్య త్రైమాసికంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా 2000పైగా దరఖాస్తులు స్వీకరించి లక్ష్యాన్ని పూర్తి చేసినందుకుగాను, కేంద్ర ప్రభుత్వపు పిఎఫ్ఆర్ డీఏ నుంచి అవార్డ్ ఆఫ్ ఎక్సిలెన్స్‌ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్‌కు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసి అవార్డు పొందినందుకుగాను జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌ను అభినందించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా మరింత ఉత్సాహంతో పనిచేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని అంకోలి, తంతోలి మార్గంలో సర్వే నంబర్ 68/ట ప్లాట్ యజమానులు సోమవారం కలెక్టరేట్ రాజర్షి షాకును కలిసి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌ను కలిసి సర్వే నంబర్ 68/6 లే అవుట్ నుండి లింక్ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సర్వే నంబర్ నుండి ప్రధాన రహదారికి వెళ్లడానికి రోడ్డు లేకుండా ముందున్న లేఅవుట్ యజమానికి కంపౌండ్ నిర్మించాడని తెలిపారు. సదరు 68/6 ప్లాట్ యజమాని తమ ప్లాట్లకు లింక్ చేయకుండా, ప్రధాన రహదారికి వెళ్లకుండా పూర్తిగా ప్రీకాస్ట్‌తో ఫెన్సింగ్ వేశారని పేర్కొన్నారు. దీంతో తమకు వెళ్లడానికి ఇబ్బందులతో పాటు రోడ్డు సౌకర్యం కూడా లేదన్నారు. వెంటన్ ఫెన్సింగ్ తొలగించి తమకు మార్గం చూపాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి ఫెన్సింగ్‌ను మూడు రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. ప్లాట్ యజమానులకు భరోసా కల్పించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్లాట్ యజమానులు దత్త్రాత్రి, సంతోష్, ప్రవీణ్ కుమార్, సునీల్ కుమార్, నీల్‌కమల్, ఓంప్రకాష్ , రాజేశ్వర్, సంతోష్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాల సమస్యలు పరిష్కరించండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలం తోషం ఆశ్రమ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. తోషం ఆశ్రమ పాఠశాలలో సుమారుగా 320 మంది విద్యార్థులు చదువుకుంతున్నారని కానీ పాఠశాలలో అనేక సమస్యలున్నాయన్నారు. ఇటీవల పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయిందన్నారు. పాఠశాలలో 10 మాత్రమే టాయిలెట్స్ ఉన్నాయని, అందులో ఆరు పనిచేయడం లేదన్నారు. పాఠశాల కాంపౌండ్ బయట బోరు ఉండడంతో గ్రామస్తులు వాడుకుంటున్నారన్నారు. దీంతో విద్యార్థులకు స్నానాలకు కూడా ఇబ్బంది అవుతోందని పేర్కొన్నారు. పాఠశాలలోనే బోరు వేసి వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయాలని కోరారు. అలాగే భోజనాలకు ఇబ్బంది లేకుండా డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలను వెంటనే పంష్కరించి విద్యార్థుల చదువుకు ఆటంకాలు తొలగించాలని కోరారు.

పత్తి కొనుగోళ్లు 25కు వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం సంబంధిత అధికారులతో కలిసి సోమవారం రాత్రి మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న ప్రారంభం కానున్న పత్తి కొనుగోలు 25కు వాయిదా వేశామని తెలిపారు. రానున్న రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 25కు వాయిదా వేశామని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ఎన్నికలను సోమవారం టీఎన్జీవో సంఘ భవనంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షులుగా జొన్నల్లి సంజీవ్‌రావు, కార్యదర్శిగా బొర్లకుంట దుర్గయ్య, సహాయ అధ్యక్షులుగా వి.సూర్యప్రకాష్, ఖదీర్ అహ్మద్, రాఖీ, జాయింట్ సెక్రటరీగా చిక్కల గంగన్న, బి.మల్లేష్, ఇప్ప నర్సారెడ్డి, నసీమ, ట్రెజరీగా ఇజ్జగిరి రాందాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.సత్యనారాయణ, రౌతు దేవేందర్, కార్యనిర్వాహక సభ్యులుగా జాదవ్ అశోక్ కుమార్, తాలిబ్, నైమతుల్లఖాన్, గజానన్, స్వప్న నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ నియామక పత్రాలు అందచేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జనరల్ ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. ప్రమాద ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీరితోపాటు అల్లోల మురళీధర్‌రెడ్డి, మేడారం ప్రదీప్, వెంకటరాంరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, పివి రమణరెడ్డి ఉన్నారు.

ప్రజారోగ్యం..గాలిలో దీపం..!

- నిబంధనలు విస్మరిస్తున్న హోటళ్లు, స్వీట్‌హౌస్‌లు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు
- గతంలోనూ పలుమార్లు తనిఖీలు..నోటీసులతో సరి
- నిరంతరం కొనసాగితేనే ప్రజారోగ్యానికి భరోసా

జిల్లాలో కొందరు హోటల్ నిర్వాహకుల ధనదాహం కారణంగా ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారుతోంది. తినే వంటల్లో నాసిరకం సరుకులు..అపరిశుభ్ర వాతావరణం, హానికర రసాయనాలు వినియోగించడం మూలంగా ప్రజల ప్రాణాలకే ప్రమాదకరంగా పరిణమించింది. డబ్బులు తీసుకొని పెట్టే భోజనం కూడా నాసిరకంగా.. ప్రమాదకరంగా ఉండటంతో జనాల ఆరోగ్యానికి భరోసా లేకుండా పోతోంది. తాజాగా ఆదిలాబాద్‌లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలతో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బూజుపట్టిన కూరగాయలు, కుళ్లిన మాంసం, నిల్వ చేసిన మసాలాలు వినియోగిచడంతో పాటు అపరిశుభ్ర వాతావరణంలో వంట తయారు చేయడం వంటివి అధికారుల దృష్టికి రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఓ స్వీట్ హౌస్‌లో క్యాన్సర్ కారకాలైన కృత్రిమ రంగులను వినియోగించిన తీరుపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం సంచలనంగా మారింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జనాకి ఏమైతే మనకేంటి... మనకు మాత్రం లాభం రావాలి..అనే ధోరణిలో కొన్ని హోటల్‌లు వ్యవహరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. కనీస ప్రమాణాలు పాటించకుండా.. నిబంధనలకు నీళ్లొదులుతూ తయారుచేస్తున్న భోజనంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏదో సరదాగా హోటల్‌గా వెళ్లి భోజనం చేద్దామని భావించిన వారికి అక్కడి నిర్వాహకుల తీరుతో ప్రాణాలకు గ్యారెంటీలేని పరిస్థితి తలెత్తుతోంది. ఇటీవల హైదరాబాదులో ఓ వ్యక్తి కుళ్లిన చికెన్ మాంసాన్ని ఫాస్ట్‌ఫుట్ సెంటర్లు, కొన్ని హోటల్‌లకు సరఫరా చేశారనే విషయం అధికారులు పసిగట్టారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా అలర్ట్ అయింది. రాష్ట్రంలో తనిఖీలు చేపట్టాల్సింగా ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించడంతో రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దీంతో ఇక్కడా కూడా విస్మయపరిచే విషయాలు వెలుగులోకి రావడంతో జనం ఒక్కసారిగా కంగుతిన్నారు. ఇన్నాండ్లు, ఆయా హోటల్‌లు, స్వీట్‌హౌస్‌లలో పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నదా అని





జనాలు ఒక్కసారిగా ఆందోళన చెందారు. సంబంధిత శాఖ అధికారులు ఆహార పదార్థాల శాంపిల్‌ను సేకరించడంతో పాటు వారికి నోటీసులు జారీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నిరంతరం కొనసాగితేనే మేలు..!

ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్‌స్టేఫీ డిపార్ట్‌మెంట్ ఉందనే మాటే కానీ ఆ శాఖ అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. ఆయా హోటల్‌లలో ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు ఆ శాఖ అధికారులను సంప్రదించాలంటే ..వారు ఎవరో కూడా జనానికి తెలియని పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలో ఆ శాఖ కార్యాలయం ఎక్కడుందో చిరునామా కూడా తెలియని పరిస్థితి ఉంది. గతంలో కొన్ని హోటల్‌లను తనిఖీ చేసిన అధికారులు అపరిశుభ్ర వాతావరణంపై ఆగ్రహం వ్యక్తం చేయడం.. శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించడం చేతులు దులుపుకోవడం వంటి చర్యలకే పరిమితమయ్యారనే విమర్శలున్నాయి. కేవలం నోటీసులతోనే సరిపెడుతున్న కారణంగా నిబంధనలు విస్మరించే హోటల్‌ల నిర్వాహకులు కూడా ఈ తనిఖీలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. తాజాగా రాష్ట్ర స్థాయి అధికారులు వచ్చి దాడులు చేస్తే కొన్ని హోటల్‌ల డొల్లతనం బయటపడగా.. జిల్లా స్థాయి అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తుంటే.. వారిలో కొంచెమైన భయం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదో అడపాదడప తనిఖీలతో సరిపెట్టకుండా నిరంతరం కొనసాగితే.. హోటల్, స్వీట్‌హౌస్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనల మేరకు నడుచుకునేందుకు అవకాశం ఉంటుందనే వాదన వినిపిస్తోంది.

నిరంతరం తనిఖీలు కొనసాగిస్తాం : వాసురాం, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి,ఆదిలాబాద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తాం. ఆహారభద్రత చట్టం ప్రకారం హోటల్‌లు, బేకరీలు లైసెన్సులు కలిగి ఉండటమే కాకుండా కిచెన్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి ఒక్కరు నిబంధనలు మేరకు వ్యవహరించాలి. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

తుడుందెబ్బ ధర్నాలో ఉద్రిక్తత

- కలెక్టరేట్ ఎదుట ఆదివాసుల ధర్నా
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి షరతులు విధించకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, కటాప్ లేకుండా రైతు భరోసా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో నాయకులకు పోలీసులకు మధ్య జరిగిన తోపులాటతో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకొని ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం నగేష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి రైతాంగాన్ని, ముఖ్యంగా ఏజెన్సీ రైతులను ఆదుకోవాలన్నారు. రుణమాఫీతో పాటు రైతు భరోసా, కౌలు రైతులకు రైతు భరోసాను అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు భరోసా(రైతుబంధు) నేటి వరకు ఇవ్వలేదన్నారు. ధరణి పోర్టల్ రద్దు చేసి భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పిందన్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక రాష్ట్రవ్యాప్తంగా పదుల సంఖ్యలో రైతులు తనువు చాలిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామంటే 20లక్షల ఎకరాలకు దరఖాస్తులు పెట్టుకున్నారని కానీ కేవలం 4లక్షల ఎకరాలకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి గత ప్రభుత్వం చేతులు దులిపేసుకుందన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా రైతు రుణలు మాఫీ చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల విభాగంలో వినతిపత్రమిస్తామని అందరూ ఒక్కసారిగా లోపలకు చొచ్చుకెళ్లందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేవలం ఐదుగురు మాత్రమే వెళ్లాలని సూచించగా అందరూ ఒక్కసారిగా తోసుకుని వెళ్లడంతో గందరగోళానికి దారితీసింది. స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం కలెక్టర్ బయటకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఆదివాసీ రైతు మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తూ నెట్టివేస్తూ అవమాన పరిచిన పోలీస్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, డీవిజన్ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, రూరల్ మండలం అధ్యక్షులు మెస్రం కేశవ్ పాల్గొన్నారు.





పట్టభద్రుల భవిష్యత్తుకు భరోసా

- ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పని చేస్తా
- అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి





నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు సహకరిస్తానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కెఎస్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగుల గురించి పోరాటం చేస్తామని చెప్పి రాజకీయ పార్టీలు నిరాశ గురి చేస్తున్నాయన్నారు. పట్టభద్రులైన నిరుద్యోగులకు కనీసం మూడు సంవత్సరాలు పాటు నిరుద్యోగ భృతి చెల్లించేందుకు తాను పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. పోటీ పరీక్షలను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా దీపావళి కానుకగా పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేందుకు ఆల్ఫోర్స్ సంస్థ నుండి ఒక యాప్‌ను విడుదల చేస్తున్నామని వెల్లడించారు. దీని ద్వారా 35 రకాల ఉద్యోగాల పోటీ పరీక్షల్లో అభ్యర్థులకు ఉచిత శిక్షణ పొందే వీలు కలుగుతుందన్నారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనకు అందరూ సహకరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గురుకులాలు మోడల్ స్కూల్ ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్టు, గెస్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పట్టభద్రులకు కనీసం కూలికి లభించిన వేతనం కూడా లభించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు, బదిలీలు ప్రమోషన్ల కోసం తాను పోరాటం చేయనున్నట్టు వెల్లడించారు. కొత్తగా ప్రాక్టీస్ ప్రారంభించిన న్యాయవాదులకు వృత్తిలో కనీసం మూడు సంవత్సరాల పాటు స్టయిఫండ్ ఇచ్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడితో ఉన్నట్టు వెల్లడించారు. నూతన విద్యా విధానం కారణంగా తమ భవిష్యత్తుపై ప్రైవేటు విద్యాసంస్థలు ఆందోళనకు గురవుతున్నందున వారి సమస్యల పట్ల తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతూ పట్టభద్రులకు సముచిత స్థానం కల్పించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి వారధిగా ఉంటానని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికలలో అతి కీలకమైన ఓటర్ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, నిబద్ధత, అంకితభావం కలిగిన తనను ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో సంబంధిత విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక లోడ్ లారీలను నిలువరించాలి

- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌బాబు
- డీటీఓ కార్యాలయ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ పేపర్ మిల్లుకు వచ్చే లారీలు అధిక లోడుతో వస్తూ పట్టణవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెన్న కిషోర్‌బాబు ఆరోపించారు. మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, లారీ అసోసియేషన్ సభ్యులతో కలిసి జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి డిటిఓ రామచందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై పేపర్ మిల్‌కు చెందిన వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తూ పట్టణ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఇతర ప్రాంతాల నుండి లారీలు రావడం వల్ల వారు లాభాల ఉద్దేశంతో అధిక లోడ్ తీసుకువస్తున్నారని ఆరోపించారు. వాటిని నివారించే స్థానిక లారీలకు అవకాశం కల్పించి పట్టణ ప్రజల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు. మిల్లు యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తూ స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తుందని ఆరోపించారు. దీన్ని అడ్డుకునే దిశగా కదం తొక్కుతున్నట్లు వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుండి వస్తున్న రవాణాదారులు తిరిగి వెళ్లిపోవాలని లేదంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అధిక లోడ్ వాహనాలను నివారించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మొయినుద్దీన్, కోశాధికారి రాజేందర్, నాయకులు శంకర్, అమీర్, షారుక్, మోతీరాం పాల్గొన్నారు.

ఖంపూర్‌లో గర్భిణులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని ఖంపూర్‌లో గర్భిణులకు సోమవారం ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు బీపీ, షుగర్, బరువు తదితర పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో అంగన్‌వాడీ టీచర్ సలాం విజయలక్ష్మి, ఆశా రంభాబాయి ఉన్నారు.

కళాశాలలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-తాంసి

తెలంగాణ బతుకమ్మ సంబరాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఎంతో సంబురంగా నిర్వహించారు. కళాశాల బాలికలు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్ధంగా అందరూ కలిసి పూజలు చేశారు. అనంతరం డీజే బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ గ్రామ సమీపంలోని వాగు వద్దకు తీసుకువెళ్లి వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, మాజీ సర్పంచ్ కృష్ణ, ఎంఈఓ శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- పట్టణంలో భారీ ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అమరవీరుల త్యాగాల చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, దేశ సరిహద్దు రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గల అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, రెండవ బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలతో స్తూపం వద్ద నివాళులర్పించారు. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య అమరవీరులను మనస్ఫూర్తిగా స్మరించుకున్నారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం, దేశ రక్షణలో విధి నిర్వహణమే ముఖ్యంగా అసువులు బాసిన 214 మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్ రావ్ చదువుతూ స్మరించుకున్నారు. ముందుగా ఉన్నతాధికారులు అందరూ కలిసి స్తూపం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి శోక్ శస్త్ర ద్వారా రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరులను స్మరించుకుంటూ జిల్లా పోలీసు యంత్రాంగం అధికారులు కలిసి స్థానిక కలెక్టర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. తదుపరి అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన, పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని తెలియజేశారు. పోలీసులు నిస్వార్థమైన సేవలను అందిస్తారని, వారికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకుంటూ వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయాలని వారి కుటుంబ సభ్యులను సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని తెలియజేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని సూచించారు.

పదిరోజులు ప్రజాహిత కార్యక్రమాలు...

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ అక్టోబర్ 21న ప్రతి సంవత్సరం జరుపుకునే అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) 65 సంవత్సరాల కింద లడఖ్ సమీపంలో భారత సరిహద్దుల్లో పహారకాస్తున్న మన పోలీసు సిబ్బందిపై చైనీయులు దాడి చేశారని అన్నారు. ఈ ప్రదేశాన్ని హాట్ స్ప్రింగ్‌గా పేర్కొంటారని, 1959 అక్టోబర్ 21న ఆ సమయంలో విధి నిర్వహణలో వీరోచితంగా పోరాడి చేయనీయుల చేతులు అసువులు బాసిన పదిమంది సీఆర్పీఎఫ్ జవాన్ల వీరమరణం సందర్భంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే దినోత్సవాన్ని అమరవీరుల ను స్మరించుకుంటూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారి సంస్మరణ జిల్లాలో పది రోజులపాటు ప్రజా హిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నార్త్ తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లాలో 50 మంది పోలీసు అధికారులు సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. ఈ సంవత్సరం నార్నూర్ మండలంలో గ్రేహౌండ్స్ పోలీసు ఆడే ప్రవీణ్ ప్రాణాలను కోల్పోయిన విషయం తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ, ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. అసువులు బాసిన పోలీసు ప్రతి ఒక్కరి స్ఫూర్తి బాటలో జిల్లా పోలీసు యంత్రాంగం కొనసాగుతుందని తెలియజేశారు. జిల్లాలోని అమరవీరులను, వారి త్యాగాలను స్మరించడానికి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లా హెడ్ క్వార్టర్స్ లో వారి ముఖ చిత్రాలతో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, డి.సురేందర్‌రెడ్డి, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ...

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ అన్నారు. సోమవారం పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళు లర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తమ ప్రాణాలర్పించారని అన్నారు. వారి త్యాగాలను, ఎప్పటికీ మరువలేనివని అన్నారు. పోలీసు అమరవీరులకు నివాళుర్పించిన వారిలో మాల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న, అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు మలపతి సుభాష్, ముచ్చ రఘు పాల్గొన్నారు.



ఫ్లాగ్ డే సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు



పోలీసులు అమర వీరులకు నివాళులర్పిస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

ఎల్ఐసీ ఏజెంట్లకు కమీషన్ పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఏజెంట్లకు కమిషన్ పెంచాలని సోమవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షులు మద్దెల చందర్ మాట్లాడారు. 1 గంట నుంచి 2 గంటల వరకు ఆలిండియా పిలుపుమేరకు ప్రతి ఎల్ఐసీ ఆఫీస్ ముందర మీటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎల్ఐసీ ఏజెంట్లు నినాదాలతో హోరెత్తించారు. ఏజెంట్ల కమిషన్‌ను పెంచాలని నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉష్కం నర్సింగ్, దేవన్న, ఉశన్న, విశ్వనాథ్, భీంరావు, బుడ్డి రాజన్న, ప్రకాష్, అశోక్, కేదార్‌నాథ్, ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ ఒకేషనల్ కళాశాలలో పీడీఎస్‌యూ 50 వసంతల స్వర్ణోత్సవ సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగరి వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 24న ఓయూలో జరిగే 50 వసంతల స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. 50 ఏండ్ల పీడీఎస్‌యూ విప్లవ ప్రస్థానంలో అనేకమంది విద్యార్థినీ, విద్యార్థులు తమ ప్రాణాలను తృణప్రాయం చేశారన్నారు. ఏ విద్యార్థి సంఘానికి లేని త్యాగాల చరిత్ర పీడీఎస్‌యూ సంస్థకి ఉందన్నారు. ధ్వంసమవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యా కార్పొరేటీకరణకి వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్నీ రద్దు కోసం పీడీఎస్‌యూ అనునిత్యం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, హర్షవర్ధన్, ఎస్‌కే రహమాన్, నవనీత్, గణేష్, ప్రణయ, సరిత, రేణుక, మౌనిక, గీతా పాల్గొన్నారు.

విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడాలి

- జీసీడీఓ ఛాయా



నవతెలంగాణ-నార్నూర్

పాఠశాలకు విద్యార్థుల గైర్హాజరు కాకుండా చూడాలని జీసీడీఓ ఛాయా, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు జామడ, మాన్కాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు సమ్మేటివ్-1 మూడు నుంచి పదో తరగతి వరకు ప్రణాళిక ప్రకారం పరీక్షను నిర్వహించాలని సూచించారు. పరీక్షల నిర్వహణను పరిశీలించారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు సీహెచ్ వందన, విఠల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువైద్యాధికారులకు ఘన సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో గత 13 సంవత్సరాలుగా పశువైద్యాధికారిగా పనిచేసిన దూద్‌రామ్, కొత్తగా బదిలీపై వచ్చిన వైద్యాధికారి మేకల లావణ్యలకు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా మండల ప్రజలతో మమేకమై మూగజీవాలకు సైతం ప్రాణం పోసి బదిలీపై వెళ్లడం బాధాకరమైనప్పటికీ ఉద్యోగరీత్యా ఉద్యోగులకు బదిలీలు పదోన్నతులు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమన్నారు. రాత్రనక పగలనక ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే మూగజీవాలకు వైద్యం చేసిన ఘనత డాక్టర్ దూద్‌రామ్‌దేనన్నారు. కొత్తగా బదిలీపై వచ్చిన డాక్టర్ మేకల లావణ్య అదే బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంఈఓ వెంకట్‌రావు, సొసైటీ సీఈఓ మోతి శ్రీను, పీఆర్ ఏఈ నారాయణ, మాజీ ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, రమేష్‌రెడ్డి, గ్రామస్తులు మేకల రవికాంత్, శ్రీనివాస్‌రెడ్డి, రావుల నారాయణ, రామిరెడ్డి, సాయి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఈనెల 25న జరిగే సీపీఐ(ఎం) ఆదిలాబాద్ రూరల్ మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి నెల్ల స్వామి అన్నారు. సోమవారం యాపల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలు గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటలకు రూపాకల్పన చేసేందుకే ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని ప్రజలు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దాసు, విష్ణు, నాగోరావ్ పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలు తమ అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ప్రధానమంత్రి జన సురక్ష యోజన పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం వల్ల కలిగే లాభాలను గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులంతా పీఎం విశ్వకర్మ పథకానికి అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువమందిని తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగ్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం బోయవాడ గ్రామానికి చెందిన శంకర్ తనకు ఉద్యోగం కల్పించామని, కాసిపేట్ మండలం మాలకెపల్లి గ్రామానికి చెందిన ఆత్రం శంకర్ తనకు పై చదువులకు కొరకు ల్యాప్‌టాప్ మంజూరు చేయించామని కోరారు. ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన గణేష్ తనకు కిరాణా దుకాణం మంజూరు చేయించాలని కోరారు. దేగాం మండలం దేవులగూడ గ్రామానికి చెందిన సోములాల్ తనకు పట్టా చేయించాలని కోరారు. పింఛన్, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో, ఏపీఓ వసంత్‌రావు, ఏడీఎంహెచ్ఓ, ఈఈ భీంరావ్, కుడిమేత మనోహర్, ఏఓ దామోదర్, పీహెచ్ఓ, సందీప్ కుమార్, ఏపీఓ, పీవీటీజీ జెడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు మార్కెట్‌లోనే సోయా పంట అమ్ముకోవాలి

నవతెలంగాణ-కుభీర్

రైతులు మార్కెట్‌లోనే సోయలు అమ్ముకోవాలని మార్కెట్ కార్యదర్శి గంగన్న అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో సోయ కొనుగోళ్లను బీట్ ద్వారా అమ్మకాలు చేపట్టారు. ప్రయివేట్ వ్యాపారులచే సోయా కొనుగోళ్ల చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో ఉన్న ఆయా గ్రామాల రైతులకు సంబందించిన పంటలను మార్కెట్ తీసుకురావాలని, మద్దతు ధర పొందేలా చూస్తామని అన్నారు. ఈ కొనుగోళ్లకు వ్యాపారులు హాజరై వేలం పాట పాడగా క్వింటాలు సోయకు రూ.4,350 ధర నిర్ణయించారు. దీంతో ప్రతి రోజు రైతులు ఉదయం సమయంలో తాము పండించిన సోయా పంటను వ్యవసాయ మార్కెట్‌కు ఉదయం 10గంటలకు తమ సరుకును తీసుకువస్తే వ్యాపారులు కొనుగోళ్ల చేపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు నిలేష్, గజనంద్, రఫీక్, నారాయణ, రైతులు ఉన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే బొజ్జన్న బువ్వ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఐటీడీఏ ఎదుట ప్రతి సోమవారం ప్రజావాణికి వచ్చేవారి ఆకలి తీర్చేందుకే బొజ్జన్న బువ్వను పెడుతున్నామని నాయకులు లాజర్ అన్నారు. వివిధ సమస్యలతో ఐటీడీఏకు వచ్చే అర్జీదారులకు బొజ్జన్న బువ్వ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆకలితో ఉండే అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాములు, శివాజీ, భీమన్న నాయకులు ఉన్నారు.



తప్పించుకోబోయి ప్రాణాలు పోగొట్టుకున్న మహిళ



నవతెలంగాణ-ఖానాపూర్

కోతుల బారి నుంచి తప్పించుకోబోయి, మహిళ ప్రాణాలు పోగొట్టుకున్న విషాద సంఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బొంగుని లక్ష్మి(50) మధ్యాహ్నం సమయంలో ఇంటి బయట ఉండగా కోతులు ఒక్కసారిగా పెద్ద గుంపుగా రావడంతో వాటి నుంచి రక్షించుకునే క్రమంలో ఆమె ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్టు తెలపడంతో కుటుంబీకులు ఒక్కసారి బోరున విలపించారు. మృతురాలుకు భర్త గంగాగౌడ్‌తో పాటు పెళ్లైన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు జైనథ్‌లో బస్‌పాస్ మొబైల్ కౌంటర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 22న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగుల బస్ పాస్ మొబైల్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకురావాలని సూచించారు. అపరాధ రుసుము రూ.50 చెల్లిస్తే 50శాతం రాయితీతో దివ్యాంగుల బస్సు పాస్ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఆయుధాల పట్ల అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ టౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం విద్యార్థులకు ఆయుధాల పట్ల అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులకు చట్టాలు, ఆయుధాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ తుత్తూరు శంకరయ్య మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని అన్నారు. తాము వేసుకున్న యూనిఫాంకు పోలీసుకు ఒక గౌరవమని, చేతిలో పట్టుకున్న ఆయుధం పోలీసుకు బలమని అన్నారు. శాంతిభద్రతల సమస్యల పరిరక్షణతో పాటు కేసుల దర్యాప్తులో పోలీసులు ఉపయేగించే ఆయుధాలు, రక్షణ పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐలు దీకొండ రమేష్, సుధాకర్, పీఎస్ఐ అనిల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు..

నవతెలంగాణ- రెబ్బెన

సింగరేణి సేవా సమితి అందిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సుల ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన వృత్తి శిక్షణ కోర్సుల సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 నుండి సింగరేణి సంస్థ మహిళలకు ఉచితంగా వృత్తి శిక్షణ కోర్సులను అందిస్తుందన్నారు. కోర్సులను సద్వినియోగం చేసుకొని చాలా మంది మహిళలు తమ కుటుంబానికి ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారని అన్నారు. ఈ 2022-2023, 20023-24 ఆర్థిక సంవత్సరంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ అందించారు. ఈ ఆర్థిక సంవత్సరం త్వరలోనే కోర్సులు ప్రారంబిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఉమరాణి, ఏఐటీయూసీ నాయకుడు శేషశయనరావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సేవా సభ్యులు సొల్లు లక్ష్మి కుందారపు శంకరమ్మ, కోమల, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరుచేయాలి



నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని పాటగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఏనోలి, కొలాంగూడ గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల సక్రమంగా రాకపోవడంతో తాగునీటికీ గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మాకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, చేతి పంపులు కూడా చెడిపోయి వాటి ద్వారా కూడా నీరు సక్రమంగా రావడం లేదని తెలిపారు. గత ఎనిమిది నెలల క్రితం మార్చి 28 తేదీన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ వచ్చి మా గ్రామం నీటి సమస్యను పరిశీలించి భీంపూర్ గ్రామంలో ఒక హెచ్‌పి మోటర్ బిగించారు. దానికి కరెంట్ సరఫరా కావాలంటే మరొక ట్రాన్స్ ఫార్మర్ కావాలని మిషన్ భగీరథ అధికారులు చెప్పినారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ స్పందించి ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేసి రెండు రోజులలో గ్రామంలో నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీటిడిప వైస్ ప్రెసిడెంట్ సీడాం పగ్గు, గ్రామపటేల్ సిడాం ధర్ము, ఆత్రం పోత, దేవారి, కారోబార్ సిడాం భీమ్రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

దహెగాం మండలం ఇట్యాల గ్రామ శివారు సర్వే నెం. 259లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామస్థులు సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని పంట పొలాలకు వెళ్లేందుకు ఆ భూమిని గత 60 ఏళ్లుగా సదరు దారిగా రైతులు ఉపయోగించుకుంటున్నారని, దీనికి ఉపాధి హామీ పథకం కింద రోడ్డు కూడా వేసినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇట్యాల గ్రామానికి చెందిన వ్యక్తి ఈ రోడ్డును పూర్తిగా మూసివేసి ఆక్రమణకు పాల్పడ్డాడని, దీనిపై విచారణ జరిపి సదరు వ్యక్తిపై చర్య తీసుకోవాలని, ఆక్రమణను తొలగించి రైతులకు న్యాయం చేయాలని గ్రామస్థులు పేర్కొన్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ- కెరమెరి

ఆదివాసీ గ్రామాల్లో పేసా కమిటీలు ఎంపిక చేసిన అసలైన గిరిజన నిరుపేద లబ్ధిదారులను ఇందిరమ్మ గృహాలకు ఎంపిక చేయాలని సోమవారం పేసా కమిటీ మోబేలైజర్‌ల ఆధ్వర్యంలో కెరమెరి ఎంపిడిఓ అంజద్ పాషా ను కలిసి వినతిపత్రం అందజేశారు. పేసా యాక్ట్ 1996 ప్రకారం అట్టడుగు, నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం పేసా గ్రామ సభలకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాలకు పేసా గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎన్నుకొని ఇందిరమ్మ కమిటీలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కమిటీలకు అందజేసిన వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో పేసా మోబేలేజర్స్, మడావి భరత్ భూషణ్, సెడ్మకి తుకారం, కుర్సెంగా యాదవ్ రావు, అడ ఆనంద్‌రావు, పంద్రం యశ్వంత్ రావు, మడావి రాము తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని లోడ్‌పెల్లి గ్రామంలో నాలుగు నెలలు పైబడిన పశువులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి రాకేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు పైబడిన అన్ని పశువులు, గేదెలకు ప్రభుత్వం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందజేస్తుందని, పశు పోషకులు పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్, పశు వైద్యసిబ్బంది సురేష్, ఆనంద్‌రావు, శివ, శేఖర్ పాల్గొన్నారు.

తిర్యాణి : మండలంలోని గ్రామాల్లో పశువులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు పశు వైద్యాధికారి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుండి ప్రారంభమై నెల రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. పశువులకు ప్రభుత్వం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేస్తుందని తెలిపారు. 591 పశువులకు టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేష్, మనోహర్, సంతోష్, రాకేష్, చిత్త సాగర్ పాల్గొన్నారు.

కౌటాల : మూగజీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని బోధన్ పల్లి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో నాలుగు సంవత్సరాల పైబడిన పశువులకు గేదెలకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గేదెలకు ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం అందించినట్లయితే మీ ఇంటికి వచ్చి ఉచితంగా వైద్యం చేసి మూగజీవాలను రక్షణ కోసమే పనిచేస్తానని అన్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది సత్యనారాయణ, శోభన్, భిక్షపతి ఉన్నారు.

అధికారుల సమన్వయంతో పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో భూమి సంబంధిత దరఖాస్తులు ఎనిమిది, ఆహార భద్రతకు మూడు, పెన్షన్ ఐదు, ఇతర దరఖాస్తులు ఏడు వచ్చినట్లు తెలిపారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం



నవతెలంగాణ- ఆసిఫాబాద్

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన పోలీస్ అమరవీరుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ కాగడ వెలిగించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ఎస్పీతో పాటు ఇతర అధికారులు అమరుల కుటుంబ సభ్యులతో కలిసి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించడంతో పాటు శోక్ శస్త్రి పరేడ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం, సమాజంలో తెలియని వ్యక్తుల కోసం విధి నిర్వహణ కోసం అన్నింటినీ త్యాగం చేసే పోలీస్ వృత్తి ఎంతో గొప్పదన్నారు. శిక్షణ సమయంలో పోలీసులు విజయవంతంగా శిక్షణ పూర్తి కావడానికి ఒకరికొకరు ఎంతగానో సహకరించుకుంటారని తాను ఐపిఎస్ శిక్షణ సమయంలో అటువంటి అనుభూతి పొందానని గుర్తు చేసుకున్నారు. దానిని విధి నిర్వహణలో కూడా కొనసాగించాలన్నారు. పోలీస్ వ్యవస్థతో సమాజంలో ఎటువంటి గొడవలు లేకుండా ఉంటున్నాయని తెలిపారు. కష్టం వస్తే మొదట పోలీసులు గుర్తుకు వస్తారని తెలిపారు. దేశ రక్షణ కోసం అసువులు బాసిన పోలీసులకు వందనాలు తెలిపారు. ప్రపంచం నిద్రలో ఉంటే పోలీసులు మేల్కొని ఉంటారని కితాబునిచ్చారు. భవిష్యత్తులో పోలీసులు కావాలనుకునే వారికి అమరవీరుల దినోత్సవం స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. జిల్లా ఎస్పి డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1959లో లడక్ లో చైనా యుద్ధంలో మరణించిన పదిమంది పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న అమరవీరుల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. గడిచిన సంవత్సరంలో దేశవ్యాప్తంగా 214 మంది వివిధ సంఘటనల్లో అమరులయ్యారని వారందరికీ నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో 14 మంది వివిధ సంఘటనల్లో మరణించారని వారి కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. పోలీసులు విధి నిర్వహణ కోసం ప్రాణాలు ఫణంగా పెడతారని, అమరవీరుల దినోత్సవం దానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డిఎస్పీలు కరుణాకర్, రామానుజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు అస్వస్థత

పోలీస్ అమరవీరుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అస్వస్థతకు గురయ్యారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, గత కొద్ది కాలంగా విశ్రాంతి లేకపోవడంతో కలెక్టర్ అమరవీరులకు నివాళులు అర్పించి మౌనం పాటిస్తున్న సమయంలో కండ్లు తిరుగుతున్నట్టు కుర్చీలో కూర్చుండిపోయాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఓఆర్ఎస్ తాగించి, అక్కడినుండి క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ప్రజావాణికి హాజరుకాకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



- సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వచ్చే నెల 9, 10, 11 తేదీలలో కాగజ్‌నగర్‌లో నిర్వహించే సీపీఐ (ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ కోరారు. సోమవారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల సీపీఐ (ఎం) సమరశీల పోరాటాలు కొనసాగిస్తోందని అన్నారు. అదే సందర్భంలో జిల్లాలో కూడా అనేక ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో పోడు రైతుల పక్షాన పార్టీ పోరాడి పట్టాలు ఇప్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లాలో తునికాకు సేకరణకు వెళ్లే కూలీలకు పులి ఉందని చెప్పి తునికాకు వెళ్లరాదని అటవీ అధికారులు ఆంక్షలు విధిస్తే దీనిని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర అటవీ అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను కూలీలకు ఇప్పించడంలో పార్టీ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్ల మంజూరు, కాగజ్‌నగర్‌లో మాస్టర్‌ప్లాన్ అమలు కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రాబోయే కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం విశాల పోరాటాలు చేపట్టేందుకు ఈ మహాసభలు ఒక వేదిక అవుతాయని అన్నారు. ఈ మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, భూపాల్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్, రాజేందర్, శ్రీనివాస్, బక్కన్న పాల్గొన్నారు.

అల్పాహారం బిల్లులు చెల్లించాలి





నవతెలంగాణ- ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన కార్మికులకు జిల్లాలోని తిర్యాని మండలంలో పెండింగ్‌లో ఉన్న అల్పాహార బిల్లులు చెల్లించాలని లేదంటే మండలంలో వంట బంద్ చేస్తామని సిఐటియు జిల్లా నాయకుడు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి హెచ్చరించారు. జిల్లా ఇన్చార్జి విద్యాధికారి ఉదయ బాబుకు మండల అధ్యక్షురాలు మడావి చంద్రకళ తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే వంట బంద్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి నెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కోశాధికారి వెడ్మ ఊర్మిళ, సహాయక కార్యదర్శి కూర్సెంగ లక్ష్మీ, ఉపాధ్యక్షులు సునీత పాల్గొన్నారు.

వడ్రంగులపై అధికారుల వేధింపులు ఆపాలి

జిల్లావ్యాప్తంగా వృత్తి పని చేసుకుంటున్న వడ్రంగి కార్మికులపై అటవీ అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకుల కాలం నుండి వృత్తి పని చేసుకుంటున్న వడ్రంగి కార్మికులపై అటవీ అధికారులు అడ్డగోలుగా వేధింపులు చేస్తున్నారని అన్నారు. కార్మికులపై వేధింపులు ఆపకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని, ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకొని వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వడ్రంగి కార్మికులు పులావన్ తులసిరాం, చెన్నూరి పద్మాకర్, ఉప్పుల వెంకటేష్, ఆర్యపాక రాజయ్య, నాగుల రాజేశం, గడ్డి నాగేష్, ప్రభాకర్, దీకొండ రాజు, కొసరే బాబాన్, బహునే హన్మంతు, అత్రం కిషోర్ పాల్గొన్నారు.

కుంరంభీం ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ- కెరమెరి



జల్, జంగిల్, జమీన్ కోసం అసువులు బాసిన కొమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ ద్రుపత బాయి అన్నారు. కుంరంభీం 84 వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం సాకడ చౌరస్తాలో భీం వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ పోరాట యోధుడు అమరజీవి కుమురం భీం 84వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని సాకడ చౌరస్తా వద్ద కుమురం భీం వర్ధంతిని ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామం నుండి డప్పు వాయిద్యాలతో ర్యాలీగా చేరుకొని కుమురం భీం విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీల మనుగడ కోసం పోరాడి తన జీవితం కోసం జీవితాన్ని త్యాగం చేసిన అమర వీరుడని పేర్కొన్నారు. ప్రతి గిరిజనుడు భీం స్ఫూర్తితో ఆయన అడుగు జాడల్లో నడవాలని ఆయన సేవలను గుర్తు చేశారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావు, మాజీ సర్పంచులు జలపతిరావు, సుమిత్రబాయి, గ్రామ పటేల్ పెందోర్ దంభిరావు, ఆదివాసీ నాయకులు మడావి రఘునాథ్, రాయిసిడా జంగు, అనక దేవరావు, చాహకటి శ్యాంరావు, సెడ్మకి తుకారాం, పెందోర్ శ్రీనివాస్, వినేష్, మాలి సంఘం నాయకులు సెండే నారాయణ, వాడై సోనేరావు పటేల్, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ప్రజావాణి ద్వారా వచ్చే సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సమస్యలు అధికారులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రజలు వస్తారని, వారికి స్వాంతన కలిగించే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. సమస్యలు పరిష్కరిస్తే గుర్తింపు వస్తుందని సూచించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారిని దరఖాస్తులు స్వీకరించారు.

నూతన విద్యుత్ శాఖ ఇంజనీర్‌గా రవీందర్

నవతెలంగాణ - తిర్యాణి

మండల నూతన విద్యుత్ శాఖ ఇంజనీర్‌గా రవీందర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి, కమలాకర్, లైన్‌మెన్ అరుణ్, కృష్ణ, నిరంజన్, సిబ్బంది విజయ్, మారుతి, బాధిరావు, ఆపరేటర్ సత్తిపండు పాల్గొన్నారు.

రెస్టారెంట్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అడ ప్రాజెక్టు వద్ద లేక్ వ్యూ రెస్టారెంట్ నిర్వహించేందుకు అర్హత, ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెూటల్ మేనేజ్మెంట్ లో డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసి ఉండాలని, ప్రముఖ రెస్టారెంట్ లో కుక్ గా పనిచేసిన అనుభవం ఉండాలని, రెస్టారెంట్ ఫుడ్ ఐటమ్స్ వండటం వచ్చి ఉండాలని పేర్కొన్నారు. 18-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఉండాలని, గిరిజనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసక్తి, అర్హత గల గిరిజన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ లోగా ఉట్నూర్ లోని సమగ్ర గిరిజనాభివద్ధి సంస్థ పరిధిలో గల గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9493535052, 9666748105, 6281667501 లలో సంప్రదించవచ్చుని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

24న వేలం పాట

నవతెలంగాణ- సిర్పూర్(టి)

మండలంలోని మాకిడి గ్రామ శివారులో అక్రమముగా నిల్వ ఉంచిన ఇసుక ను రెవిన్యూ అధికారులు, ఏడి మైన్స్, జియాలజీ శాఖతో కలిసి గత కొన్ని రోజులు క్రితం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలు తెలిపారు. పట్టుబడిన ఇసుకను రెవెన్యూ ఇన్స్పెక్టర్ సమక్షంలో ఈనెల 24 తేదీన ప్రభుత్వ నియమావళి ప్రకారం వేలం నిర్వహిస్తున్నట్లు, ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

25న జాబ్ మేళా

నవతెలంగాణ ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 25వ తేదీన నిరుద్యోగ యువత కొరకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఉపాధి కల్పన అధికారి సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కె.ఎల్. గ్రూప్ నందు హైదరాబాద్ లో పని చేయుటకు 200 లేడీ గార్డ్స్, మేల్ గార్డ్స్, సూపర్వైజర్స్, రిసెప్షనిస్ట్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, ఎస్ ఎస్ సి, ఇంటర్, డిగ్రీ అర్హతలతో, 18-30 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, ఆసక్తి, అర్హత కల నిరుద్యోగ యువత ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లాలోని కాగజ్‌నగర్ లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, ఇతర వివరాలకు 9550441888, 9160608476, 9440514962 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి గల అభ్యర్థులు సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి

నవతెలంగాణ- రెబ్బెన

జీఆర్ఎస్ ఖైరిగురా ఓసి మైన్ లో గత పది సంవత్సరాల నుండి బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని సోమవారం బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌కు బ్లాస్టింగ్ కార్మికులు మెమోరాండం అందించారు. వీరి వెంట సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబాల ఓదెలు ఉన్నారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు మల్రాజ్ శ్రీనివాస్, తిర్యాని మండల్ టిఆర్ఎస్ నాయకులు శంకర్ గౌడ్ మద్దతు తెలిపారు.

పద్మశాలి సంఘం ఎన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ- ఆసిఫాబాద్

పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా అనుమండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అల్లె శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ సభ్యులు చెన్నూరి ప్రకాష్, భోగ మధుకర్, అనుమాండ్ల రవీందర్ తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో భాగంగా సోమవారం కోమటిపల్లి లింగయ్య, జంజరాల సంజీవ్ తమ నామినేషన్లను ఉపసంహరణ చేసుకోవడంతో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. ఎన్నికైన వారికి ఈనెల 27న ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేయడం జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

శనగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ- కౌటాల

సహకార సంఘం కేంద్రంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పిఏసిఎస్ డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కేంద్రంలో సోమవారం శనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు విత్తనాల కోసం అధైర్య పడవద్దని శనగ విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. 25 కేజీల శనగ విత్తనాల బస్తా ధర రూపాయలు 2250 ఉందన్నారు. రైతులు తీసుకోవడానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు వెంట తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో రాజేష్, ఏఈఓ ఘన్‌శ్యాం ఉన్నారు.

ముగిసిన బులాయి సంబరాలు

నవతెలంగాణ - వాంకిడి

దసరా నుండి తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బులాయి సంబరాలు సోమవారంతో ముగిశాయి. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మండలంలో మహిళలు ప్రత్యేకంగా ఈ పండుగను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఒక్కరోజు ముందు మహిళలు ఇతర ప్రాంతాల నుండి మట్టిని తీసుకొచ్చి బులాయి విగ్రహాలను మట్టితో తయారుచేసి మరుసటి రోజు నిమజ్జనం చేస్తారు. అధిక పంటలు పండాలని, అందరు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలు ఉత్సాహంగా ఆటపాటలు ఆడి అనంతరం భాజాభజంత్రీలతో ఊరేగించి నిమజ్జనం చేశారు.

ప్రైవేట్ విద్యార్థులకు హాజరు నుండి మినహాయింపు

నవతెలంగాణ- ఆసిఫాబాద్

కళాశాలకు రాకుండా ప్రైవేట్‌గా ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరం హాజరు నుండి మినహాయింపు ఇస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని కళ్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు నవంబర్ 20 లోపు వారు చదువుతున్న కళాశాలలో 500 రూపాయలు మినహాయింపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని, 200 రూపాయలు అపరాధ రుసుముతో డిసెంబర్ 18 లోపు చెల్లించాలని ఇతర వివరాల కోసం ఆయా కళాశాలల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పంట పొలాల పరిశీలన

నవతెలంగాణ-మందమర్రి



వర్షానికి పాడైన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి పరిశీలించారు. శనివారం కురిసిన వర్షానికి చిర్రకుంట, పొన్నారం, తిమ్మాపూర్ గ్రామాల్లో నేల కొరిగిన వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజు పరిశీలించారు. వ్యవసాయ అధికారుల వెంట రైతులు బండి యాదగిరి, సిద్ధం జనార్ధన్, మారిశెట్టి సదానందం, కడియాల రాజయ్య, సురేష్ ఉన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. సోమవారం జన్నారం గ్రామపంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు రుణాలను డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన్నారం మాజీ సర్పంచ్ నందు నాయక్, మాజీ ఉప సర్పంచ్ అజారుద్దీన్, ఏపీఎం బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శి శ్రీపాల్, సిసి చారి, లక్ష్మీనారాయణ, ప్రకాష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విరమణ పొందిన ఆర్మీ జవాన్‌కు సన్మానం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన అబ్దుల్ వహీద్ 22 సంవత్సరాలుగా దేశ సరిహద్దులు కాపాడి విరమణ పొందినందుకు ఆయనతోపాటు పదో తరగతి వరకు చదువుకున్న మిత్ర బృందం పూలమాలు వేసి ఘనంగా సన్మానించారు. విరమణ పొందిన తర్వాత తన సొంత గ్రామానికి రాగా మిత్రులంతా కలిసి ఆయనకు మేళతాలాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వహీద్‌తో పాటు చదువుకున్న మిత్రులు మాట్లాడుతూ దేశ సేవ చేయడం గొప్ప అవకాశమన్నారు.

భీమారం ఎస్సైగా శ్వేత బాధ్యతలు



నవతెలంగాణ-జైపూర్

భీమారం ఎస్సైగా శ్వేత సోమవారం బాధ్యతలు చేపట్టారు. చెన్నూర్ ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఆమె భీమారం ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన రాములు ఇంటెలిజెన్స్ విభాగం ఎస్సైగా రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-నార్నూర్

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ జవహర్‌లాల్, తహసీల్దార్ రాజలింగం సూచించారు. సోమవారం మండలంలోని మరపగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని భవానిగూడలో ఇందిరా మహిళ శక్తి పేదరిక నిర్మూలన సంస్థ ఐకేపీ, బ్యాంక్ ద్వారా జై భవాని స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇందిరా మహిళ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మైస రమేష్, తాడిహత్నూర్ బ్రాంచ్ టీజీ బ్యాంక్ మేనేజర్ ఆంబోతు శ్రీనివాస్, సిబ్బంది సునీల్, గ్రామకార్యదర్శి స్నేహ, సీసీ సంతోష్, శ్రీరామ గ్రామైఖ్య సంఘం సభ్యులు దేవపటార్ ఉన్నారు.

కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-నేరడిగొండ

భీంపూర్ మండల కేంద్రంలో ఈనెల 30న నిర్వహించే కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ మాజీ సర్పంచ్ మడవి లింబాజీ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డైరెక్టర్ కాళ్లే శ్రీధర్ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని బాలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడారు. తెలంగాణ మట్టి కళా రూపాలకు పట్టం కట్టి, యావత్తు తెలంగాణ సకల కళలకు పునర్ వైభవం నింపారని అన్నారు. కళల పట్ల ఎంతో ప్రేమ అనురాగాల ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్, ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, ప్రకాష్, పిల్లలు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరులను స్మరించకోవడం అందరి బాధ్యత

- రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

విధి నిర్వహణలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజా రక్షణలో ఎల్లవేళలా ముందుండి పోరాడే పోలీసు అమరవీరుల సేవలు స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి డీసీపీ చేతనతో కలిసి గౌరవ వందనం స్వీకరించి విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వివిధ సంఘటనలో ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులతో పోరాడి అసువులు బాసిన అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 214 మంది పోలీస్ అధికారులు ప్రజా రక్షణలో ప్రాణత్యాగం చేశారని తెలిపారు. 1959 అక్టోబరు 21న భారత్-చైనా సరిహద్దున సియాచిన్ ప్రాంతంలోని భూ భాగాన్ని ఆక్రమించేందుకు చైనా రక్షణ బలగాలు యత్నించగా డిఎస్‌పి కరమ్‌సింగ్ ఆధ్వర్యంలో 10 మంది సిఆర్‌పిఎఫ్. జవాన్లు విధులు నిర్వర్తిస్తున్నారని, అక్సాయ్ చిన్ ప్రాంతంలోని హాట్ స్ప్రింగ్ వద్ద జరిగిన పోరాటంలో జవాన్లు అమరులయ్యారని అన్నారు. దేశ రక్షణ కోసం చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి, దేశం కోసం ప్రాణాలు వదిలిన అమర జవాన్ల స్మారకార్థం ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నామని, వీరుల రక్తం పారిన ప్రదేశాన్ని పవిత్ర స్థలంగా భావించి అన్ని రాష్ట్రాల పోలీసులు సందర్శించి నివాళులర్పిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో, ప్రజల మాన, ప్రాణ రక్షణలో పోలీసు పాత్ర కీలకమైనదని, సంఘవిద్రోహక శక్తులకు వ్యతిరేకంగా పోరాడి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడే పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. ప్రాణం కంటే విధి నిర్వహణ గొప్పదని చాటిన అమరుల త్యాగాలు మరువలేనివని, వారి త్యాగాలను స్మరించుకునేందుకే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపిలు, మంచిర్యాల, జైపూర్ ఎసిపిలు, ప్రకాష్, వెంకటేశ్వర్లు, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్ ఎసిపిలు, సిఐలు, ఇన్‌స్పెక్టర్లు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హాజీపూర్ : ప్రపంచమంతా నిద్రావస్థలో ఉంటే పోలీస్ నిరంతర కాపాలాదారుడిగా ఉంటూ పండగా, పబ్బాలను వదిలిపెట్టి చేపట్టే విధులతో పాటు సమాజంలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేనివని కమాండెంట్ వెంకటరాములు అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్లో 66వ పోలీస్ అమరవీరుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సిబ్బంది స్మృతి పరేడ్ నిర్వహించిన అనంతరం అమరవీరుల స్థూపం ఎదుట పలు పోలీస్ అమరవీరులకు బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, పోలీస్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు ఉంచి పుష్పాలతో ఘన నివాళులు అర్పించి వారి త్యాగాలను స్మరించారు. ఈ సందర్భంగా వెంకటరాములు మాట్లాడారు. పోలీసుల త్యాగాలు ఎంతో విలువైనవని, విధుల్లో వారి బాధ్యత, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా, దేశ సేవలో ముందుంటున్నామని తెలిపారు. వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సంతోస్‌సింగ్, ఆర్ఎలు, ఆర్ఎస్సైలు, శిక్షణ కానిస్టేబుళ్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 18 మంది ఏఎన్ఎంలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ విధులు నిర్వహిస్తున్నారన్నారు. 5 నెలలుగా వేతనాలు, పీఫ్, ఈఎస్ఐ సదరు ఏజెన్సీ నిర్వాహకులు ప్రతి నెల చెల్లించడం లేదన్నారు. గతంలో 7నెలల వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. ఇప్పటివరకు మొత్తంగా 13నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో దసరా పండుగ పూట కూడా అర్థాకలితో గడిపారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు వారి ఖర్చులు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు అన్నింటికీ చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్టీ డిపార్ట్మెంట్, ఏజెన్సీ నుండి గుర్తింపు కార్డులు, యూనిఫామ్ లు ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఏఎన్ఎంకు సిక్ రూమ్ ఇవ్వాలని, కలెక్టర్ స్పందించి వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు సుమిత్ర, రాజమణి, కోశాధికారి భవాని, భారతి, లలిత, రాధాకుమారి, శైలు, ప్రవళిక, మందాకిని, స్వప్న, లలిత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరాలి

నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా అధికారులు చూసుకోవాలని, శిక్షణ కలెక్టర్లు అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని పొన్నారి గ్రామంలో శిక్షణ కలెక్టర్లు సుబీచౌహాన్, విశ్వదీప్ మట్టు, అమర్ జీత్ కుజురు, కుల్దీప్ మీనా, ప్రశాంత్ నానావారి, పూజా కుమారి పర్యటించారు. ఈ సందర్భంగా మండల అధికారులు నాయకులు శిక్షణ కలెక్టర్లకు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. నాలుగు రోజులపాటు ఆరుగురు శిక్షణ కలెక్టర్లు గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వివిధ అంశాలను పరిశీలించి, నివేదిక ప్రభుత్వానికి అందించనున్నట్టు అధికారులు తెలిపారు. అనంతరం శిక్షణ కలెక్టర్లు, అధికారులు స్థానిక నాయకులతో చర్చించారు. బతుకమ్మ నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా మహిళా కలెక్టర్లు బతుకమ్మలను పట్టుకొని గ్రామస్తులను ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ ఫణిందర్, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీఓ లింగయ్య, పంచాయతీ సెక్రటరీ గంగన్న, నాయకులు గడుగు గంగన్న, లింగారెడ్డి, రఘు, అశోక్, లక్ష్మీపతి గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ ఆలోచనను విరమించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



ఎస్సీలను వర్గీకరించే ఆలోచనను విరమించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో మాల నేతకాని ఉపకులాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలిసి ఉన్న దళిత, గిరిజన బహుజనులను విడదీయడానికి కేంద్రంలో బిజెపి దాని అనుబంధ సంస్థలు యత్నిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలంగా పావులు కదుపుతోందన్నారు. మాదిగలు, నేతకానీలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదని భావించి రేవంత్‌రెడ్డి మంత్రుల కమిటీ వేశాడని తెలిపారు. నరేంద్ర మోడీ ఎన్నికల ముందు బహిరంగంగానే పూర్తి మెజార్టీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్‌లను తీసేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అందుకే వర్గీకరణ అంశాన్ని తెచ్చిందని పేర్కొన్నారు. ఎస్సీలను విభజించే వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మాల, నేతకాని ఉపకులాలతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కుమురంభీమ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

కుమురంభీం యువత ఆదర్శంగా తీసుకోవాలని గ్రామపటేల్ జుగ్నాక్ సంతోష్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని కొలమా గ్రామంలో కుమురంభీం 84వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయం ప్రకారం పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్ర భగవంత్‌రావ్, కుమ్ర శంకర్, మాజీ ఉపసర్పంచ్ తెలంగ్ రావ్, కుమ్ర ప్రభాకర్, జుగ్నాక్ భాగవంత్‌రావ్, జుగ్నాక్ జంగు, కుడ్మేత జంగు, సిడం భీర్‌షావ్, పెందోర్ హన్మంత్‌రావ్, కొట్నాక కృష్ణ, కుమ్ర కాశీరాం, భీంరావ్, కొట్నాక, శంకర్, కనక దేవరావ్, యాదవ్ రావ్, జుగ్నాక్, ముకుంద్‌రావ్, తారుబాయి ఉన్నారు.

పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు



నవతెలంగాణ-హాజీపూర్

మండల కేంద్రంలోని పశువైద్య శాలలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ శాంతిరేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 162 ఆవు జాతి, 155 గేదె జాతి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ అగ్నివేశ్, పశువైద్య సహాయకుడు నారాయణ, గోపాల మిత్ర రవి, పశుయజమానులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా పంపిణీ చేయాలి

నవతెలంగాణ-జన్నారం

షరతులు లేకుండా 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి మహిళకు దసరాకు పండుగకు ముందే మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసిందన్నారు. కానీ ఈ ప్రభుత్వం దసరా బతుకమ్మ పండుగలు అయిన తర్వాత కూడా పంపిణీ చేస్తూ, కేవలం డ్వాక్రా మహిళలకు ఇచ్చి, మిగతా వారికి ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. మహిళలందరికీ బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీర అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిటీమల్ల భరత్ కుమార్ జిల్లా కార్యదర్శి జాడి గంగాధర్, జిల్లా నాయకులు ఫజల్‌ఖాన్, జునుగురి మల్లయ్య, దాసరి శ్రీనివాస్త పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధం

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు సమస్యలు పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధపడుతున్నారు. సోమవారం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టల్ బ్యాలెట్‌లో సమ్మెకు మద్దతుగా ఓటు వేశారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిధి 1021 మంది కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టాలని ఓటు వేసినట్లు హెచ్ఎంఎస్ నాయకులు వెల్లడించారు. 2 సంవత్సరాలుగా ఎస్టీపీపీలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమస్యల పరిష్కారం కోసం అనేక సందర్భాల్లో హెచ్ఎంఎస్ ద్వారా సంబంధిత అధికారులను కలిసి విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి సెకండ్ షిఫ్ట్ మూడు గంటల వరకు ఎస్టీపీపీలో సుమారు 1400 మంది కార్మికులు పని చేస్తుండగా 1021 మంది పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొన్నారు. ఇందులో 9 మంది మాత్రమే సమ్మె వద్దంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, ఎస్టీపీపీ అధికారులు కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు వెళ్లకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యాక్షులు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి, ఎస్టీపీపీ నాయకులు విక్రమ్ కుమార్, చిప్పకుర్తి సంపత్, సాయి కృష్ణారెడ్డి, దీప్ రెడ్డి, నవీన్ చారి, రిక్కుల సంతోష్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపు ఐఎన్టీయూసీతోనే సాధ్యం



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపు ఐఎన్టీయూసీతోనే సాధ్యమని తెలంగాణ ప్రభుత్వ కనీస వేతన మండల చైర్మన్, ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగిన ఆర్కే5 గనిపై గేట్ మీటింగ్, నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో నాయకులు, గుర్తింపు సంఘంగా ఉన్న టిబిజికెఎస్ కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా సింగరేణి సంపదను దోచుకున్నారని ఆరోపించారు. వారిని ప్రశ్నించని ఏఐటీయూసీ నాయకులు ఐఎన్టీయూసీ విమర్శిస్తూ, గుర్తింపు సంఘ బాధ్యతలను విమర్శిస్తూ అనవసరమైన ఆరోపణలతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సింగరేణి భవిష్యత్ కోసం,కార్మిక హక్కుల కోసం ఎవరు పనిచేస్తున్నారో కార్మికులు ఆలోచించాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేణ శ్యామ్, జాతీయ సమితి సభ్యులు భీంరావు, ఉప ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, ల్యాగల శ్రీనివాస్, పేరం రమేష్,భీం రవి పాల్గొన్నారు.

హిందూ దేవాలయంపై దాడులను అరికట్టాలి



నవతెలంగాణ-ఉట్నూర్

హిందూ దేవాలయంపై దాడులను ఆరికట్టాలని హిందూ సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం మండలంలోని పోచమ్మ ఆలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం సీఐ మొగిలికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రితేష్ రాథోడ్, సట్ల అశోక్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని భాగ్యనగర్‌లో ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడులను హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అన్నయ్య, అక్కలపై అమానుష్యంగా లాఠీచార్జి చేసి అక్రమంగా అరెస్టులను ఖండిస్తున్న మన్నారు. హిందూ ఆలయంపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని సూచించారు. మరోసారి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దన్‌లాల్, మహేష్, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

మానవత దృక్పథంతో గొర్రెలు విరాళం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని రామ్‌సింగ్ తండాలో గురువారం పిడుగుపడి 70 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న చుట్టుపక్క గ్రామలకు చెందిన గొర్రెల పెంపకందారులు సోమవారం 40 గొర్రెలను బాధిత రైతు చౌహాన్ వినేశ్‌కు విరాళంగా అందజేసి మానవత్వం చాటు కున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పిడుగు పడి నష్టం వాటిల్లిన రైతుకు గొర్రెలు విరాళంగా అందించిన వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మరికొందరు దాతలు ముందుకు వచ్చి బాధిత రైతును ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు వివిధ గ్రామాలకు చెందిన దాతలు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 22, 2024 | www.navatelangana.com

సోయా రైతు.. పరేషాన్..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆరుగాలం కష్టించి పండించిన సోయా పంటపై ప్రకృతి కన్నెర్ర జేసింది. గత వారం రోజుల నుంచి ఆంధ్రలో తుపాను హెచ్చరికలు వాతావరణ శాఖ జారీ చేసింది. మండలంలో పత్తి పంట తరువాత అత్యధికంగా సాగుచేసేది సోయా పంటనే. ప్రస్తుతం సోయా పంట కోత దశకు రావడంతో రైతన్న ఆ పంట హార్వేస్టర్‌తో తీసే ప్రయత్నంలో ఉన్నాడు. అయితే గత వారం రోజుల నుంచి వాతావరణం కారు మబ్బులతో మేఘావృతమైంది. ప్రతి రోజు ఏదో ఒక చోట వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఆ పంటను ఎండకు అర బెట్టుదామన్న వర్షం ధాటికి తడిచి పోతోంది. మార్కెట్‌కు అమ్ముదామన్న 12శాతం లోపు తేమ ఉండాలి లేదంటే గిట్టుబాటు ధరల్లో కోత విధిస్తారు. మండలంలో ఈ ఖరీఫ్‌లో మొత్తం 3,609 ఎకరాల్లో సోయా పంటను సాగుచేశారు. ప్రభుత్వం పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,892తో కొనుగోలు చేస్తోంది. ఐతే ఈ వర్షాల ధాటికి తేమ శాతం పెరగడంతో రైతులు అర బెట్టటానికి నానా అవస్థలు పడుతున్నారు. ఓ వారం రోజుల పాటు వర్షం వీడితే పత్తి, సోయా పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంది.

ఎంపీని కలిసి మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, నాయకులు ఎంపీని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్, గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న, నాయకులు గంపల ప్రభాకర్, బేర దేవన్న, మెట్టు ప్రహ్లాద్, సూరం భగవాండ్లు, దాసరి బాబన్న, పాశం రాఘవేంద్ర, బోండ్ల వెంకటస్వామి, ఐత పొచ్చన్న, చిల్క పొచ్చన్న, స్వరూప, విజయ ఉన్నారు.

క్రీడాకారులకు ఐటీడీఏ పీఓ సత్కారం



నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల జాతీయ ఖోఖో అథ్లెటిక్స్ పోటీలలో పథకాలు సాధించిన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులను ఐటీడీఏ పీఓ కుష్బూ గుప్తా సోమవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో శాలువాలతో సత్కరించారు. క్రీడాకారులకు మిఠాయిలు తినిపించి అభినందించరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటి పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఇటీవల కాలంలో ఖోఖో, అథ్లెటిక్స్, హాకి క్రీడలలో పలువురు విద్యార్థులు రాణించడం శుభ పరిమాణమన్నారు. గిరిజన ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కోచ్‌ల సేవలను కొనియాడారు. ఆటలలో రాణించిన గిరి పుత్రులను ఐటీడీఏ ద్వారా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులు సిడా శంకర్, పెందూర్ హనుమంతు, ఆత్రం యాదవ్‌రావు, రాథోడ్ శివ, మెస్రం నిఖిల్, ఆత్రం శివచరణ్, రాథోడ్ కార్తీక్, శివకృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డిడి జె.వసంతరావు, జిల్లా గిరిజన క్రీడా అధికారి కె. పార్థసారథి, హెచ్‌ఎం ఆర్. ఉత్తం, జగన్, పీడీలు జె.హేమంత్, మధుసూదన్, జల్‌పథ్, సురేష్ పాల్గొన్నారు.


గ్రామ పంచాయతీ కట్టుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలం గణేష్ పూర్ గ్రామం ప్రస్తుతం అటవీ శాఖ పరిధిలో ఉందని దీంతో గ్రామ పంచాయతీ భవనం కట్టుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ కట్టుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గ్రామానికి ఏళ్లుగా పంచాయతీ భవనం లేదన్నారు. దీనివల్ల గ్రామంలోని ప్రజలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కూర్చోవాల్సి రావడంతో అటు విద్యార్థులకు ఇటు గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి పర్మిషన్ ఇప్పిచ్చేటట్టు చూస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బాపురావు, టేకం భీంరావు, మడావి చిన్ను, వికాస్, టేకం జంగు ఉన్నారు.

విద్యార్థులు నిర్ణీత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు నిర్ణీత లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సీఐ సతీష్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైందన్నారు. వ్యాసరచన పోటీల్లో భాగంగా ఇచ్చిన మొబైల్ వాడకం వల్ల నష్టాలు రాయడమే కాకుండా వాటిని అనుసరించాలని సూచించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మారుతున్న టెక్నాలజీని నేటి యువత అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. అప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను పెండింగ్ పెట్టకుండా పరిశీలన జరపాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ శ్యామలదేవిలకు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. ప్రజావాణిలో 93 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతీ పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. పాఠశాలలలో విద్యార్థుల హాజరు, మెనూ ప్రకారం భోజనం, వసతులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ సౌజన్యంతో తుంపల్లిలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్ టు రీడ్ సంస్థ, యుఎస్ఎఐడి సహకారంతో ఎస్ఈఆర్ఐ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్‌కు అనుబంధంగా జిల్లా విద్యాశాఖ సమన్వయంతో జిల్లాలో ప్రతి మండలానికి ఒక మండల మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులలో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. రూమ్ టు రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన ఈ మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల 500 కథల పుస్తకాలు, పఠన సామాగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చని అన్నారు. చదవడం అనేది అలవాటుగా మారేలా చేయవచ్చని, తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థులతో పుస్తకాలు చదివించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యా బోధన జరుగుతుందని, పుస్తకాలను చదవడం, చతుర్విధ ప్రక్రియలు చేయడం ద్వారా డిసెంబర్ 4న జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. రూం టు రీడ్ ఇండియా సంస్థ ద్వారా 15 మండలాలలో జిల్లా విద్యాశాఖ మోడల్ లైబ్రరీస్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో అర్థవంతమైన పఠన సామర్థ్యాలు పెంపొందించి తద్వారా తరగతిలో కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, తల్లిదండ్రులు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి విద్యాశాఖ అధికారి ఉదయబాబు, రూమ్ టు రీడ్ తెలంగాణ స్టేట్ మేనేజర్ నరసింహచారి, జిల్లా విద్యాశాఖ క్వాలిటి కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుభాష్‌బాబు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై అమరవీరుల స్మారకార్థం కాగడాను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో, రాష్ట్ర భద్రతలో పోలీసు కూడా అంతే కీలకమని అన్నారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ప్రజావసరాలకు, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అక్టోబర్ 21 ప్రాముఖ్యతను వివరిస్తూ, 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పిగొట్టిన రోజు ఇది. ఈ సమరంలో కొంత మంది పోలీసులు అమరులయ్యారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందాం. దేశ సరిహద్దుల్లో సైనికులు అమరులైన రోజు ఇది. 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. వారి స్మృతి చిహ్నంగా జరుపుకుంటున్నదే అమరవీరుల దినోత్సవం అన్నారు. వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమాన్ని, వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను సర్వస్వం లభింపచేయడం, అయా కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులేనని తెలియజేశారు. ఈ సందర్భంగా త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు వారి సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించారు. అనంతరం పోలీసు వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ అమరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఒక్కొక్కరుగా వచ్చి అందరూ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఈ సంవత్సరం అమరులైన వారి పేర్లను రోల్ ఆఫ్ హానర్‌ను అదనపు ఎస్పీ సూర్యనారాయణ చదివారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సూర్యనారాయణ, భైంసా ఎఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ స్టాఫ్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు సోమవారం ఎస్సై ఎస్.మధుకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ అభ్యర్థిని గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూటీఎస్ అధికారిక అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ము కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత గల అందరూ ఉపాధ్యాయులు ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. అధికారిక అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరసింహస్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వినోద్‌రెడ్డి, అర్బన్ శాఖ అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పిల్లి కిషన్, ఆదిలాబాద్ రూరల్ అధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకలను బీజేపీ మండల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదినం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగం, మాజీ జెడ్పీటీసీ పుష్పలత, నాయకులు మరప్ప రాజు, కనక తుకారాం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సనాతన ఉత్సవ సమితి సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కలెక్టర్ రాజార్షిషాను సోమవారం ఆయన కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దసరా ఉత్సవాల విజయవంతానికి సహకరించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, రవీందర్, నర్సోజీ, సంజీవ్, రాజు, సుభాష్, సత్యం, వేణు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్ కోరారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ గజిటెడ్ నెంబర్1 పాఠశాలలో ఓటు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలా దేవితో అలాగే ఉపాధ్యాయులతో వందశాతం ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ- సిర్పూర్(టి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలైన రైతు భరోసా, రైతు బంధు, రుణమాఫీ, మహాలక్ష్మి తదితర హామీలను వెంటనే అమలు చేయాలనీ టిఆర్ఎస్ మండల కన్వీనర్ అస్లాంబిన్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. రైతుబంధు, రైతు భీమా వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీ పేరిట అబద్ధపు మాటలతో ప్రభుత్వం గద్దెనెక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ లక్ష్మణ్ , రాజేష్, పట్టణ అధ్యక్షుడు నందాజీ, సీనియర్ లీడర్ షేక్ చంద్, సిహెచ్ సంతోష్,జెల్ల రాజేష్, అజ్మీరా ప్రకాష్, రవి వర్మ, భీంరావ్ లోఖండే, సునీల్, గౌతమ్, దుర్గం రశేఖర్, దుర్గం భరత్, అమీర్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బిట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. రైతులకు ఇచ్చిన హామీలను మరిచిపోయి రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. పథకాలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. రోడ్డుపై ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, గోపాల్, పత్రు, శేఖర్, మహేష్, రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల విద్యార్థినికి కాంస్య పతకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆలం శైలజ అండర్ 14 ఇయర్స్ కిడ్స్ జావీలిన్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, గెలుపుకు కారణమైన శిక్షకుడు విద్యాసాగర్‌ను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి అభినందించారు. విద్యార్థిని మరింత మంది గిరిజన విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు. కుమురం భీమ్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోట్నాక విజయ్, సట్ల శంకర్, గుండం లక్ష్మణ్, హ్యాండ్‌బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకుల తిరుమల్ విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, ఏసిఎంఓ పి.ఉద్ధవ్, ఏటీడీఓ చిరంజీవి, జీసిడిఓ శకుంతల పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం



నవతెలంగాణ-ముథోల్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవటం లేదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో సోమవారం వరి కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రైతులకు వడ్లకు క్వింటాల్‌కు అదనంగా 500 బోనస్ ఇస్తానని చెప్పి ఇప్పుడు సన్న రకం ఇస్తానని ప్రకటించడం సరికాదన్నారు. రుణమాఫీ కూడా అందరు రైతులకు మాఫీ కాలేదని తెలిపారు. ప్రభుత్వ ఏర్పడి పది నెలలు దాటినా రైతు భరోసా ఇప్పటివరకు రైతులకు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ పేరిట రైస్ మిల్లర్ వడ్లను కోత విధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు అన్యాయం జరిగితే తాను ఎట్టి పరిస్థితిలో సయించబోనని స్పష్టం చేశారు. రైతుల పక్షాన అసెంబ్లీలో మాట్లాడతానన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ తీగల వెంకటేష్‌గౌడ్, తహసీల్దార్ శ్రీకాంత్, బిజెపి మండల అధ్యక్షులు కోరి పోతన్న, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, ధర్మపురి సుదర్శన్, నాయకులు నర్సాగౌడ్, దత్తాద్రి, నిమ్మ పోతన్న, రాంచందర్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ కార్యకర్త గులాబ్ సింగ్ కుటుంబానికి ఆదుకుంటామని, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఏమాయికుంటకు చెందిన మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశాడు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, మేము అండగా ఉంటామని భరోసా యిచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట మండలాధ్యక్షులు ఆరెల్లి రాజలింగం, సంజయ్, రాజవర్ధన్ ఉన్నారు.